క్లుప్తంగా

యువకుడి పై దాడి

కడప అర్బన్ : కడప నగరం ఏఎస్ఆర్ నగర్ వద్ద ఓ యువకుడుని కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఏఎస్ఆర్ నగర్ కు చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం రోడ్డు మీద ఉండగా అక్కడే ఉన్న ఆటో డ్రైవర్ ప్రశాంత్ ల మధ్య మాట మాటా పెరిగి రామాంజనేయులు తలపై కర్రతో దాడి చేయడంతో తలకు గాయమైనట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా

కడప అర్బన్ : కడప సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేకంగా నిఘా ఉంచామని, ఎక్కడైనా విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. మత్తు కోసం పిల్లలు ఇంజక్షన్లు కూడా వాడుతున్నట్లు సమాచారం వచ్చిందని, అలాంటి వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు నిఘా ఉంచాలని, వారు ఎక్కడెక్కడ తిరుగుతున్నారో.. ఎవరితో మాట్లాడుతున్నారనే విషయంపై దృష్టి సారించాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత వహిస్తే వారు చెడు మార్గంలో లేకుండా సన్మార్గంలో వెళ్లే అవకాశం ఉంటుందని సూచించారు.

రిమ్స్ ఓపీలో క్యాంటీన్ మూసివేత



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఓపీ విభాగంలో క్యాంటీన్‌ను ఈనెల 1వ తేదీ నుంచి మూసివేశారు. అధికారులు గడువు ముగిసిందని ఆదేశాలు జారీ చేయడంతో మూసివేసినట్లు సమాచారం. మరోవైపు కూటమి ప్రభుత్వం ప్రతినిధులే తమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి, నిర్వహించాలని అదే పనిగా అధికారులతో ఒత్తిడిని తీసుకుని వచ్చి బలవంతంగా క్యాంటీన్‌ను మూసివేయించినట్లు సమాచారం. గత పదేళ్లుగా ఓపీలో క్యాంటీన్‌ను నిర్వహిస్తున్న వారు ఒక్కసారిగా క్యాంటీన్‌ను మూసివేయడంతో జీవనోపాధిని ఐదుగురు కోల్పోయినట్లు తెలుస్తోంది.

రిమ్స్ అభివృద్ధి కోసం కృషి

కడప అర్బన్: కడప రిమ్స్ లో పరిపాలన, పర్యవేక్షణ అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని డిప్యూటీ కలెక్టర్ యు. రంగస్వామి బుధవారం తెలిపారు. ప్రభుత్వం తరపున ప్రతి హాస్పిటల్ లో రోగుల బాగోగులు చూసుకునేందుకు ఆరు రకాలైన పద్ధతుల్లో ఆకస్మికంగా విచారణ జరుగుతుందన్నారు. డాక్టర్లు సమయపాలన పాటిస్తున్నారా, రోగుల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారు. సిబ్బంది ఎలా పనిచేస్తున్నారు, వారి ప్రవర్తన ఎలా ఉంది, శానిటేషన్ ఎలా ఉంది, డబ్బులు ఎవరైనా అడిగి తీసుకుంటున్నారా అనే విషయాలపై సమగ్రంగా పర్యవేక్షణ పెట్టామన్నారు. సమయపాలన పాటించకుండా విధులు నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని తెలియజేశారు.

పీఎం విశ్వకర్మ పథకం రుణాలు మంజూరు

కడప కార్పొరేషన్: ప్రధానమంత్రి విశ్వకర్మ కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రుణాలు మంజూరు చేయుటకు ఆయా బ్యాంకు మేనేజర్లు అంగీకారం తెలిపారని ఆ శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాష ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఎనిమిదో తేదీన రుణాలు మంజూరు కు దరఖాస్తు చేసుకున్న మహిళా అభ్యర్థులు వెంటనే తమ బ్యాంకు మేనేజర్లను కలిసి రుణాలను విడుదల చేయించుకోవాలని కోరారు.

చెట్టంత నిర్లక్ష్యం



అధికారుల చెట్టంత నిర్లక్ష్యానికి ఈ చిత్రాలే ఉదాహరణ. నిత్యం వందలాది మంది ప్రయాణీకులతో రద్దీగా ఉండే పాత బస్టాండ్ దుస్థితి ఇది. కనీస సౌకర్యాలు కరువయ్యాయి. బస్సులు వచ్చేంత వరకూ వేచి ఉందామన్నా కూర్చునేందుకు సరైన వసతులు లేవు. నిలబడి ఉందామన్నా చుట్టూ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. పై పెచ్చులు ఎప్పుడు ఊడిపడతాయో అన్న భయంతో ప్రజలు ఉండాల్సిన దయనీయ పరిస్థితి ఉంది. సమస్య పరిష్కరించాల్సిన అధికారులు మాత్రం మొద్దునిద్ర వీడడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







కేసులు రాజీ అయ్యే విధంగా చూడాలి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ తమ సిబ్బందితో కలిసి ఉమ్మడి జిల్లాల పోలీసు అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ సమావేశాన్ని నిర్వహించారు. కడపలోని జిల్లా కోర్టులో న్యాయ సేవాసదన్‌లో జడ్జి తన ఛాంబర్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈనెల 8న జరుగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేయాలని సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే, జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, ప్రొద్దుటూరు డీఎస్పీ భావన, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను అందజేయాలి

కడప రూరల్: కొన్ని సాంకేతిక కారణాల వలన జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన నిరుద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వాహనాలను అందజేయడానికి చర్యలు తీసుకోవాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ శంకర్ తెలిపారు. ఆ మేరకు బుధవారం స్థానిక జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీ. రాజ్యలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2017 నుంచి 2018 ఏడాదికి సంబంధించి ఆ నాటి టీడీపీ ప్రభుత్వం ఎస్సీ నిరుద్యోగుల ఉపాధి కింద స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాల కింద జాతీయ నిధులతో ట్రాక్టర్లు, ఆటోలను మంజూరు చేసిందన్నారు. ఈ వాహనాలకు సంబంధించి కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా అర్హులైన వారికి పంపిణీ చేయలేకపోయారని తెలిపారు. దీంతో ఆ వాహనాలన్నీ నాటి నుంచి నేటి వరకు మహిళా శక్తి ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు ఉన్నది టీడీపీ ప్రభుత్వమే అయినందున తక్షణం వాహనాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రబాబు, వేణు, విష్ణు, రాజా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చొక్కా పట్టుకొని నిలదీస్తారు

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి

మైదుకూరు : ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న చంద్రబాబును రాబోవు రోజుల్లో ప్రజలు చొక్కా పట్టుకుని నిలదీస్తారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ కమిటీల కార్యవర్గం ఏర్పాటుపై నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాగద్వేషాలు లేకుండా పదవిని నిర్వహిస్తామని ప్రమాణం చేసి, ఇటీవల గంగాధర నెల్లూరులో వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు ఏ పనులు చేయకూడదని చంద్రబాబు చెప్పడం శోచనీయమన్నారు. టీడీపీ కార్యకర్తలు ఓట్లు వేస్తేనే చంద్రబాబు గెలిచారా అని ప్రశ్నించారు. ఓట్లు వేసిన వారు ప్రజలు కాదా అన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఆ విధంగా మాట్లాడటం రాజ్యాంగ ఉల్లంఘన కాదా అన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు తీసేస్తారనో.. కేసులు పెడతారోనని భయపడుతుండొచ్చు కానీ, సమయం వచ్చినప్పుడు చొక్కా పట్టుకుని తీరుతారని అన్నారు. నిన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర నుంచి కౌంట్ డౌన్ మొదలైందని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో 64 శాతం ఓట్లు రాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 30 శాతానికి పడిపోయిన విషయం చంద్రబాబు తెలుసుకోవాలన్నారు.

హిట్లర్‌లా వ్యవహరిస్తే చంద్రబాబు గెలవడు

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడమే పాలనగా మారిందని రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై 15–20 కేసులు పెడుతున్నారని.. ఇదేనా పాలన అని ప్రశ్నించారు. పోసానిపై 15 కేసులు పెట్టారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీ వారు ఎన్నో మాటలు అన్నారని, వేల వీడియోలు ఉన్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పట్లో చర్యలు తీసుకుని ఉంటే వారు తిరిగేవారా అని ప్రశ్నించారు. హిట్లర్, ముస్సోలినీ లాగా వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో టీడీపీకి, కూటమి పార్టీలకు బిగ్ జీరో సీట్లు వస్తాయి చంద్రబాబు కూడా గెలవలేడని అన్నారు.

అప్పు తెచ్చిన సొమ్ముపై శ్వేత పత్రం ఇవ్వాలి

కూటమి ప్రభుత్వం ఈ పది నెలల్లో రూ.లక్షా 34వేల కోట్ల అప్పు చేసిందని ఆ సొమ్మంతా దేనికి ఖర్చు చేసిందో శ్వేత పత్రం విడుదల చేయాలని రవీంద్రనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు కంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్కువ అప్పు చేసినా మేనిఫెస్టోలో ఏం చెప్పారో 98 శాతం అమలు చేసిన ఘనత ఆయనదే అన్నారు.

రైతులు సంతోషంగా లేరు

కూటమి ప్రభుత్వంలో రైతులు సుఖంగా, సంతోషంగా లేరని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. అదే జగన్ ప్రభుత్వంలో ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించినట్లు తెలిపారు. కేపీ ఉల్లికి ధర లేకపోతే రూ.5వేలు ఇచ్చి కొనుగోలు చేసి ఆదుకున్నట్లు తెలిపారు. పసుపు పంటకు రూ.6,500 ధర ఇచ్చి కొనుగోలు చేశామన్నారు. ఏటా రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క రైతుకైనా ఒక్క రూపాయి వచ్చిందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సమయం ఇచ్చామని అవసరమైతే రైతులకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అండగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉంటుందని రఘురామిరెడ్డి పేర్కొన్నారు.

సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మైనార్టీ నేత మదీనా దస్తగిరి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వెంకటసుబ్బమ్మ, ప్రధాన కార్యదర్శి కిరణ్మయి, చేనేత, వాణిజ్య, బీసీ సెల్ తదితర విభాగా జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వివిధ సంఘాల నాయకులు, కార్మికులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను సత్వరమే ఉపసంహరించుకోవాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేయం), కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, గిరిజన సమైక్య జాతీయ సమితిల పిలుపు మేరకు కడప రెవిన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం రోజురోజుకు రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ, రైతులకు, కార్మికులకు, వ్యవసాయ కార్మికులకు, గిరిజనులకు తీవ్రమైన అన్యాయం చేస్తోందన్నారు. అన్ని పంటలకు మద్దతు ధరను నిర్ణయించాలని, రైతుల, కౌలు రైతుల రుణాలను బే షరతుగా మాఫీ చేయాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేనిపక్షంలో రైతాంగ, కార్మిక, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను, ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏఐకేఎస్) కడప జిల్లా అధ్యక్షులు ఎం. వి. సుబ్బారెడి, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్. నాగసుబ్బారెడ్డి, బి. మనోహర్, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు పోతిరెడ్డి భాస్కర్, దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం(బీకేయంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సి.సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

పెండ్యాల సేవలు ప్రశంసనీయం



పెండ్యాల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూనియన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత పెండ్యాల రామ్మోహన్ రావు అందించిన సేవలు ప్రశంసనీయమని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివారెడ్డి, రీజినల్ అధ్యక్షులు నాగముని కొనియాడారు. బుధవారం రామ్మోహన్‌రావు 20వ వర్ధంతిని పురస్కరించుకుని యూనియన్ నాయకులు బస్టాండు ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ్మోహన్‌రావు యూనియన్ స్థాపించి 38 సంవత్సరాలపాటు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో కార్యదర్శి శ్రీను, ప్రెసిడెంట్ జయరాం, గ్యారేజ్ ప్రెసిడెంట్ రవి, డిపో వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్, మహాలక్ష్మి, వీరా రెడ్డి, సంయుక్త కార్యదర్శులు కృష్ణ మూర్తి, లక్ష్మయ్య, జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పనులు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: విద్యుత్ పనులు చేసేటప్పుడు సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. బుధవారం విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో విద్యుత్ సిబ్బందికి భద్రతా సూచనలపై అవగాహన కల్పించేందుకు పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు తెలిసిన పనేకదా, చిన్నపనే కదా అని నిర్లక్ష్యంగా ఉండకుండా భద్రతా నియమాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు మధుసూదన్, హరిసేవ్యా నాయక్, విజిలెన్స్ ఇన్స్పెక్టర్ నరసింహారెడ్డి, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, హుస్సేన్ బాషా, డీఈఈ మోహన్ పాల్గొన్నారు.

7న మాక్ డ్రిల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : అత్యవసర రసాయనిక మాక్ డ్రిల్‌ను ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా సీకే దిన్నె మండలంలోని బలిజపల్లెలో నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అనుమతించారని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం నగర శివార్లలోని భాకరాపేట హెచ్‌పీసీఎల్ ప్లాంటు కార్యాలయంలో జిల్లా సంక్షోభ సమూహ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 54వ జాతీయ భద్రతా వారోత్సవ వేడుకలు జరుగుతున్నాయన్నారు. రసాయన ప్రమాదాలు, అత్యవసర ప్రణాళిక, సంసిద్ధత నియమాలను బట్టి మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

గొడుగుల పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని వీధుల్లో వ్యాపారం చేసే చిన్న వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేసినట్లు కెనరా బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ రీజినల్ హెడ్ మురళీమోహన్ తెలిపారు. బుధవారం ఆయన కృష్ణా సర్కిల్ వద్ద పలువురు వీధి వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేసి మాట్లాడారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో తమ బ్యాంకు తరుపున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ రమేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ విశ్వనాథకుమార్ పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఆ యూనివర్సిటీలో బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఈదురుబాష, సబ్ ఇన్‌స్పెక్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు లింగ సమానత్వం అనే అంశంపై పెయింటింగ్ కాంపిటీషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామిపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడపలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థినిపై లైంగిక వేధింపుల సంఘటన జరిగితే విద్యార్థినిలందరికీ అండగా నిలవాల్సిన డైరెక్టర్ బాధితురాలికి వ్యతిరేకంగా కేసు నమోదు కాకుండా ప్రయత్నం చేయడం దురదృష్టకరమని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నగర అధ్యక్షుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

హౌస్‌సర్జన్‌లకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయం

కడప అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, వైద్యకళాశాల (జీజీహెచ్ అండ్ జీఎంసీ)లో హౌస్‌సర్జన్‌లుగా విధులను నిర్వహిస్తున్న వారికి రాబోయే రోజుల్లో మానసిక విభాగంలో రెండు వారాలపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కాగా రిమ్స్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరాముడు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్.ఎం.సీ) నిబంధలను తుంగలో తొక్కారని.. మానసిక వైద్య విభాగంలో కనీసం 15 రోజుల పాటు హౌస్ సర్జన్‌లు శిక్షణ తీసుకోవాలని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ ప్రకటన పత్రికలలో ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన అధికారులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఓపీ విభాగంలోని పరిపాలన విభాగంలో అధికారులు సమీక్ష నిర్వహించారు. రాబోయే రోజుల్లో హౌస్‌సర్జన్‌లకు మానసిక విభాగంలో శిక్షణను రెండు వారాలపాటు ఇవ్వనున్నట్లు నిర్ణయించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కడప ఎడ్యుకేషన్: సమస్యల పరిష్కారానికి పెన్షనర్లంతా కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు పిలుపునిచ్చారు. బుధవారం కడప పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రెండు లక్షల ఈహెచ్ఎస్ అమౌంట్‌ను ఐదు లక్షలకు చేయాలన్నారు. రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసులు మాట్లాడుతూ మనకు రావాల్సిన 11వ పీఆర్‌సీ అరియర్స్, 2018 నుంచి రావాల్సిన డీఆర్ అరియర్స్ సాధించాలంటే అందరం కలసికట్టుగా ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మస్తాన్ , జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, మేకల సుబ్బరాయుడు, సంయుక్త కార్యదర్శి నాగయ్య, సంయుక్త కార్యదర్శి రామసుబ్బారెడ్డి, పదవీ విరమణ ఉద్యోగులు బాలయల్లారెడ్డి, చెంచిరెడ్డి, అపూర్వ సుందరి పాల్గొన్నారు.